నాసిరకం పనులు

- ఆరేళ్లకే బ్రిడ్జి వద్ద కుంగిపోతున్న ఫైనం
- ఆందోళనలో పలు గ్రామాల ప్రజలు



బ్రిడ్జి వద్ద కుంగిపోయిన మట్టి



ఏర్పడిన పగుళ్లు

మాచారెడ్డి : ఆ బ్రిడ్జి నిర్మాణంతో ఐదు గ్రామాల ప్రజల ఆకాంక్ష నెరవేరిందని ఆనంద పడ్డారు. కానీ ఆ దిలోనే హంసపాదు చందంగా మారుతుందని అనుకోలేదు. మండలంలోని బండరామేశ్వరపల్లి, చుక్కాపూర్ గ్రామాల మధ్య పాల్వంచ వాగుపై నిర్మించిన బ్రిడ్జి కిందికి కుంగిపోయి ప్రమాదకరంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఎన్నో ఏళ్ల స్వప్నం..

వర్షాకాలంలో వానలు కురిసి పాల్వంచ వాగు ప్రవహించిందంటే బండరామేశ్వరపల్లి, ఫరీదుపేట, దోమకొండ మండలకేంద్రంతో పాటు బీబీపేట, అంబారీపేట గ్రామాల ప్రజలు మాచారెడ్డి మండల కేంద్రానికి రావాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వస్తుండేది. తప్పనిసరి పరిస్థితుల్లో రావాలంటే పాల్వంచ మర్రి వద్ద నుంచి చుట్టూ తిరిగి రావాల్సిన దుస్థితి ఏర్పడేది. కామారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల సమయంలో బ్రిడ్జి నిర్మిస్తామని హామీలు గుప్పించారు. చివరికి 2017లో నాబార్డు నిధులు రూ.3 కోట్ల 30 లక్షల 50 వేలతో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ కృషితో బ్రిడ్జిని నిర్మించారు. రెండేళ్లుగా వానలు దంచి కొట్టడంతో పాల్వంచ వాగు ఉధృతంగా ప్రవహించింది. దాంతో బ్రిడ్జి కొంచెం కిందికి కుంగి పోయింది. ఇంకా ఒకటి, రెండు సార్లు పాల్వంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తే బ్రిడ్జి కూలిపోయే ప్రమాదముందని బండరామేశ్వరపల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోట్ల ప్రజా ధనాన్ని వెచ్చించి నిర్మించిన బ్రిడ్జి నాణ్యతాలోపంతోనే కుంగి పోయిందని గ్రామస్తులు ఆరోపించారు. అధికారులు స్పందించి బ్రిడ్జికి మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భయమేస్తోంది



నాణ్యతా లోపంతో నిర్మించిన బ్రిడ్జి మీద నుంచి పోవాలంటే భయమేస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించకుంటే బ్రిడ్జి కూలిపోయే ప్రమాదముంది.

– బకోళ్ల రాజు, బండరామేశ్వరపల్లి

మరమ్మతులు చేయించాలి..



బ్రిడ్జి కట్టాలని ఎన్నో ఏళ్ల నుంచి కొట్లాడి కట్టించుకున్నాం. కానీ ఐదారేళ్లకే ఇట్ల కుంగిపోతదని అనుకోలేదు. మరో సారి వాగొస్తే కూలిపోయే ప్రమాదముంది. కాబట్టి మరమ్మతులు చేయించాలి.

– భిక్షపతి, బండరామేశ్వరపల్లి



రోడ్డుపై వానర సేన

జంకుతున్న వాహనదారులు

మండలంలోని పలు ప్రధాన రోడ్లపై గ్రామ శివారులలో కోతుల బెడద ఎక్కువైంది. దీంతో అటుగా వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. ప్రధానంగా రామారెడ్డి, ఉప్పల్‌వాయి గ్రామ శివారులో రోడ్డుపైనే గుంపులు గుంపులుగా తిష్ట వేయడంతో ఇటువైపుగా వెళ్తున్న వాహనదారులు భయపడుతున్నారు. గ్రామాలలో సైతం కోతుల దాడులతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

– రామారెడ్డి (ఎల్లారెడ్డి)

స్థానిక సంస్థల ఎన్నికల్లో జెండా ఎగరేయాలి

–మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత ఏనుగు రవీందర్‌రెడ్డి

బాన్సువాడ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బాన్సువాడలో కాంగ్రెస్ జెండాను ఎగరేయాలని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. శుక్రవారం బాన్సువాడలోని పీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఓడిపోయినా రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, కార్యకర్తలు అధైర్య పడవద్దని, ప్రభుత్వపరంగా అమలు చేసే ఆరు గ్యారంటీ పథకాలను అర్హులైన పేదలకు అందేలా చూడాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందని అన్నారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, కార్యకర్తలు ఏ క్షణమైన ఫోన్ చేసినా తాను స్పందిస్తానని అన్నారు. నాయకులు మాసాని శ్రీనివాస్ రెడ్డి, యలమంచలి శ్రీనివాస్‌రావు, ప్రతాప్‌సింగ్, మాసాని శేఖర్‌రెడ్డి, అలిబిన్‌అబ్దుల్లా, అసద్, రఘు, అక్బర్, తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కరువు



కాద్లాపూర్ పాఠశాలలోని మరుగుదొడ్లు

బాన్సువాడ రూరల్: మండలంలోని అటవీ ప్రాంత గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కరువయ్యాయి. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల రూపురేఖలు మారుస్తామన్న తెలంగాణ ప్రభుత్వ హామీ ఎన్నికలు ముగిసినా అమలుకు నోచుకోలేదు. దీంతో పాఠశాలల్లో రంగులు వెలసిన గోడలు, పెచ్చులూడిన స్లాబ్‌లు, పగిలిన ఫ్లోరింగ్‌లు దర్శనమిస్తున్నాయి. చాలా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటలు చేయడానికి వంటగదులు కూడా లేవు. దీంతో ఆరుబయటే వంటలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన మరుగుదొడ్లు నిర్వహణా లోపంతో శిథిలావస్థలకు చేరాయి. విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు టాయిలెట్‌కు వెళ్లాలంటే ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్లను తొలగించి పరిశుభ్రత గ్రామ పంచాయితీలకు అప్పగించారు. పంచాయితీ సిబ్బంది చుట్టపుచూపుగా వచ్చి వెళ్తుండంతో పాఠశాల ప్రాంగణాలు చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. కొత్త ప్రభుత్వంలోనైనా అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలలను ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్‌లో మాదిరి కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

రాజంపేట సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం

రాజంపేట: రాజంపేట మండల సొసైటీలో పాలకవర్గసభ్యులు చైర్మెన్, వైస్ చైర్మన్లపై శుక్రవారం అవిశ్వాసం ప్రకటించారు. 9 మంది సభ్యులు ఈ మేరకు జిల్లా సహకార శాఖాధికారికి లేఖ అందజేశారు. పాలకవర్గ సభ్యులు ఎరుకల బాగయ్య, మీర్ వజహల్లీ, బచ్చంగారి బస్వయ్యల, సహకార సంఘం మినిట్స్ ఆధారంగా వారి గుర్తింపును ధ్రువీకరిస్తూ చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం ప్రకటిస్తూ తీర్మానం నోటీసులు అందజేశారు. ప్రభుత్వం మారిన వెంటనే పాలకవర్గ సభ్యులు అవిశ్వాసం పెట్టడంతో జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. మెత్తం 13 మంది సభ్యులు రెండు వర్గాలుగా చీలిపోయారు. మొన్నటివరకు బీఆర్ఎస్‌గా ఉన్న నేతలు రెండు రోజులలో కాంగ్రెస్ నాయకుల వెంట నడవడం, అవిశ్వాసం పెట్టడం జరిగిపోయింది.

బరంగెడ్గిలో దుప్పట్ల పంపిణీ



బాన్సువాడ: బీర్కూర్ మండలం బరంగెడ్గిలో లయన్స్ క్లబ్(నిజామాబాద్) ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. చలికాలం దృష్టిలో ఉంచుకుని 20 మంది వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. అనంతరం ఉన్నత పాఠశాలలో 100 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు.

నిత్యావసర సరుకులు..

భిక్కనూరు: కాచాపూర్‌లో ఇటీవల మృతి చెందిన రెండు కుటుంబాలకు గ్రామానికి చెందిన యువకుడు ఒకరు మూడు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను శుక్రవారం అందజేశారు. గ్రామానికి చెందిన రాధారపు సత్తవ్వ, మెట్టు ఎర్ర చిన్న నర్సింలు ఇటీవల వేర్వేరుగా మృతి చెందారు. వీరు ఇద్దరూ వారి కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉండేవారు. వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నారని తెలిసి భూమిని ప్రసాద్ సాయం చేశారు.

ఎమ్మెల్యే కేవీఆర్‌కు శుభాకాంక్షలు



సన్మానిస్తున్న చింతమాన్‌పల్లి సర్పంచ్ సార్ల లక్ష్మి



తపస్ నాయకులు

కామారెడ్డిలో కేసీఆర్, రేవంత్ రెడ్డిలపై సంచలన విజయం సాధించిన బీజేపీ నేత, ఎమ్మెల్యే కేవీఆర్‌కు గురువారం పలువురు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. దోమకొండ మండలం చింతమాన్‌పల్లి సర్పంచ్ సార్ల లక్ష్మి, మాజీ సర్పంచ్ సార్ల నర్సింలు, ఉద్యోగుల జేఏసీ నాయకులు తపస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

– సాక్షి నెట్‌వర్క్



సన్మానిస్తున్న ఉద్యోగుల జేఏసీ నాయకులు

మహిళలపై హింసను అరికట్టాలి



మాట్లాడుతున్న కో–ఆర్డినేటర్ రాజేందర్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని ఐఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ కో–ఆర్డినేటర్ రాజేందర్ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వెలుగు గ్రామ సంఘం మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో మహిళలపై జరిగే హింసను స్వయం సహాయక సంఘాలు ఐకమత్యంతో ఎదుర్కోవాలని, వారిని ప్రతిఘటించి హింసలేని సమాజం కోసం కృషి చేయాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో వేధింపులకు గురైతే షీటీమ్, పోలీస్ సిబ్బందికి తెలియజేయాలన్నారు. 100 లేదా 181 లేదా 1098లకు తెలియజేయాలన్నారు. సీసీ నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీవో బ్రహ్మం

పిట్లం(జుక్కల్): గ్రామ పంచాయతీల పరిధిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా చర్యలు చేపట్టాలని మండల పంచాయతీ అధికారి బ్రహ్మం పేర్కొన్నారు. ఆయన మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీల కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ..ఎప్పటికప్పుడు రోడ్లు, మురికి కాలువలు శుభ్రపరచాలని, తాగునీటి క్లోరినేషన్ ప్రతి రోజు జరగాలని, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమల నివారణకై ప్రతి రోజు గ్రామాలలో ఫాగింగ్ చేయాలన్నారు. పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్‌గా ఉంచాలన్నారు. ఏపీవో శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు అభినందనలు

ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన మదన్ మోహన్ రావుకు శుక్రవారం పలువురు కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యేను కో రారు.

– ఎల్లారెడ్డి/నాగిరెడ్డిపేట/సదాశివనగర్



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగిరెడ్డిపేట మాజీసర్పంచ్ విఠల్‌రెడ్డి



ఎల్లారెడ్డి కాంగ్రెస్ నాయకులు



సదాశివనగర్ కాంగ్రెస్ నేతలు

రాజగోపుర నిర్మాణానికి దాతల విరాళాలు



దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయ రాజగోపుర నిర్మాణానికి శుక్రవారం దాతలు విరాళాలు అందజేశారు. గ్రామానికి చెందిన అన్నందాస్ కవిత దంపతులు రూ.10,221 అందజేశారు. వీరితో పాటు ఇందూరి బాలాగౌడ్, సుగుణ దంపతులు రూ.5,116 విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ కమిటి చైర్మన్ పాలకుర్తి శేఖర్ శాలువాతో సన్మానించి అమ్మవారి ప్రతిమను అందజేశారు.

సమాచారం..

11న బాన్సువాడలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం



బాన్సువాడ: ఈ నెల 11న బాన్సువాడలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు ముదిరెడ్డి విఠల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన బాన్సువాడలో మాట్లాడారు. స్థానిక అయ్యప్ప ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం 9:30కు ప్రారంభం కానుందని తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారణ స్వాములు కృష్ణారెడ్డి, సంజీవ్, శంకర్‌గౌడ్, నర్సన్నచారి, తదితరులున్నారు.

నేడు బీఆర్ఎస్ సమావేశం

నిజాంసాగర్(జుక్కల్): పిట్లం మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్‌లో శనివారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనేతలు, నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే శుక్రవారం తెలిపారు. బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల పరిధిలోని గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని ఆయా గ్రామాల్లో ఫీల్డ్ మేనేజర్ రామ్ నారాయణ్ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలకు డబ్బులు సకాలంలో పడేలా ఫీల్డ్ ఆఫీసర్లు పని చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో రాము ఉన్నారు.

లింగంపేటలో కొనసాగుతున్న పనులు

లింగంపేట(ఎల్లారెడ్డి): పలు గ్రామాల్లో పనులు కొనసాగుతున్నట్లు ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. పథకంలో భాగంగా ఆయా గ్రామాల శివారులో నీటి నిల్వ గుంతలు తవ్వకం, గుంతల్లో పూడికతీత పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కొలతల ప్రకారం గుంతలు తీస్తేనే కూలి గిట్టుబాటు అవుతుందని సూచించారు. గ్రామాల్లో జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి పనులు కల్పించాలని సూచించారు.




నస్రుల్లాబాద్ పనులను పరిశీలిస్తున్న అధికారులు



పర్మళ్ల శివారులో పనులు చేస్తున్న కూలీలు

కొత్త ప్రభుత్వం ఏర్పాటు.. ఉద్యోగుల సంబురాలు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో టీఎన్‌జీవో ఉద్యోగులు శుక్రవారం సంబురాలను జరుపుకున్నారు. పట్టణంలోని తహసీల్ కార్యాలయం ఆవరణలో టీఎన్‌జీవో ఉద్యోగులు నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో టపాకాయలను కాల్చి, స్వీట్లు పంచుకుని సంబురాలు చేసుకున్నారు. టీఎన్‌జీవో నాయకులు మహిపాల్, చరణ్, అరుణ్, మల్లేష్, స్వాతి తదితరులున్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో రాజు

కామారెడ్డి: గత నెలలో రాష్ట్ర స్థాయిలో జరిగిన సెపక్ తక్రా క్రీడా పోటీలో అత్యుత్తమ క్రీడా ప్రదర్శన కనబర్చిన జెడ్పీహెచ్ఎస్ ఎస్సీవాడ విద్యార్థులను శుక్రవారం డీఈవో ఎస్.రాజు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం భైరయ్య, ఉపాధ్యాయులు రణ్‌వీర్, రమణా, శ్రీనివాస్, విద్యార్థులు ఉన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలి

కామారెడ్డి టౌన్: ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం విజయవంతం చేస్తామని, అయితే ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు వీడీ దాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ఇంకా 2013 నాటి వేతనాలే పొందామని తెలిపారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు.

క్లుప్తంగా

కంటి వైద్య శిబిరం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు హరికిషన్ రావు 56 మందికి పరీక్షలు చేశారు. 9 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరిని ఆపరేషన్ నిమిత్తం బోధన్ కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. ఒకరిని నిజామాబాద్ కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు. 18 మందికి కంటి అద్దాలను రేఫర్ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు కిషన్, వైద్యులు పూజారెడ్డి, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): హాజీపూర్‌కు చెందిన సబావత్ గంగారాంకు చెందిన సెల్‌ఫోన్‌ను పోలీసులు శుక్రవారం అందించారు. గంగారాం కొద్ది రోజుల క్రితం సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి బాధితుడికి ఫోన్‌ను అందించారు.

భద్రాచలానికి పాదయాత్ర



నిజాంసాగర్(జుక్కల్): సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం దెగుల్‌వాడి గ్రామానికి 12 మంది యువకులు శ్రీరామ సేవాసమితి ఆధ్వర్యంలో భద్రాచలానికి పాదయాత్రగా వెళ్తున్నారు. 500 కిలో మీటర్ల దూరం ఉన్న భద్రాచలానికి వైకుంఠ ఏకాదశి నాటికి చేరుకొని అక్కడ దేవుడ్ని దర్శించుకుంటామని భక్తులు తెలిపారు. శ్రీరామ సేవా సమితి భక్తుల పాదయాత్రకు హనుమాన్ స్వాములు, హిందూ ధర్మకర్తలు తమ వంతు సహాయం అందిస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజు




కామారెడ్డి టౌన్/రామారెడ్డి: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల హిందీ అధ్యాపకుడు యం.రాజును నియమించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం కోసం పని చేస్తానన్నారు. నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



కామారెడ్డి రూరల్: పట్టణ పరిధిలోని ఇల్చిపూర్ శివారులో కొలువుదీరిన సరస్వతీ మాత ఆలయంలో ఏకాదశి కార్తీక మాస శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతంతో అభిషేకం చేసి అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దత్తాత్రిశర్మ, విజయ్‌పాండే, సురేష్‌పాండేల ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరభ్యాసం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్, కోలాల సిద్దాగౌడ్, రోండ్ల నారాయణరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



కామారెడ్డి రూరల్: హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీవో మలహరి, ఉగ్రవాయి సర్పంచ్ జూకంటి సుమిత సూచించారు. శుక్రవారం వాటరింగ్‌డేను పురస్కరించుకుని కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామంలో మొక్కలకు నీళ్లు పోశారు. ఈ సందర్భంగా మానవాళి మనుగడ మొక్కలపైనే ఆధారపడి ఉంటుందని, ప్రతి ఒక్కరూ మొక్కలకు నీరు పోస్తూ రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, స్వరూప, సిబ్బంది ఉన్నారు.

పెళ్లి కూతుళ్లకు ఆర్థిక సాయం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని భవానిపేట గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాలకు చెందిన పెళ్లి కూతుళ్లకు శుక్రవారం ప్రముఖ వైద్యుడు రాంసింగ్ సహకారంలో ఎస్‌వీ పూజ ఆసుపత్రికి చెందిన వైద్యులు ఆర్థిక సహాయం అందజేశారు. భవానిపేటకు చెందిన చిప్ప శంకర్– శైలజ కూతురు ప్రవళిక, చిప్ప భాస్కర్– ప్రమీల కూతురు భార్గవి వివాహాలకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. వైద్యులు కృష్ణ, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.